ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 24 జూలై 2025



'స్మార్ట్'గా రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- పాతకార్డుల స్థానంలో కొత్తవి
- నేతల ఫొటోలు లేకుండా ప్రింటింగ్
- జిల్లాలో 67,313 దరఖాస్తులు



6లో

వండిందే మెనూ.. పెట్టిందే తిను



చాలీచాలని కూరలతో భోజనం చేస్తున్న విద్యార్థులు



పలుచగా ఉన్న పప్పు

- ప్రతిరోజూ ఇవ్వని గుడ్డు
- 30 గ్రాములకు మించని కోడి కూర
- విద్యార్థులతో వడ్డింపులు
- పట్టించుకోని అధికారులు
- ఇదీ గిరిజన వసతి గృహాల్లో పరిస్థితి

మెళియాపుట్టి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పదే పదే ఆదేశిస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. ముఖ్యంగా గిరిజన విద్యార్థుల వసతి గృహాల్లో వండిందే మెనూ..పెట్టిందే తినూ అన్న చందగా పరిస్థితి ఉంది. మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 115 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ముగ్గురు కుక్‌లతో పాటు ఓ కమాటీ ఉన్నారు. వీరు చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయిస్తున్నారు. మధ్యాహ్న భోజనాలను సైతం విద్యార్థులే వడ్డించుకుని తింటున్నారు. ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఉడక బెట్టిన కోడి గుడ్డు ఇవ్వాలి. కానీ, గుడ్డును సక్రమంగా అందించడం లేదు. ఆదివారం, మంగళవారం కోడి మాంసం ఒక్కొక్కరికి 100 గ్రాములు పెట్టాల్సి ఉన్నా 30 గ్రాములతోనే సరిపెడుతున్నారు. అదికూడా వారానికి ఒక్క రోజే పెడుతున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. పప్పు నీరులా పలుచగా, చప్పగా ఉంటుంది. చాలీచాలనీ కూరలు వడ్డిస్తున్నారు. కొంత మంది విద్యార్థులు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న పచ్చడి, కారం మిక్సర్‌తో అన్నం తింటున్నారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులతో వంట చేయిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరోజు గుడ్డు వేయకపోతే రూ.వెయ్యి మిగులుతుంది. దీంతో నెలకు 20 రోజులు మాత్రమే (మిగతా 6వ పేజీలో..)

విభజనతో ఇబ్బందులు..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో సుమారు 47 ఆశ్రమ పాఠశాలలు, 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు, 12 గురుకులాలు ఉన్నాయి. వీటిల్లో 16 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనతో శ్రీకాకుళంలోని సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యంకు వెళ్లిపోయింది. దీంతో కొంతమంది అధికారులు మన్యం జిల్లాకే పరిమితమవుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీవోతో పాటు ఉన్నతాధికారులు ఇటువైపు చూడకపోవడంతో వార్డెన్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వార్డెన్లు, హెచ్ఎంలు కలిసి వివిధ బిల్లులు పెట్టుకొని దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పొలానికి వెళ్లి విగతజీవిగా మారి..

- పిడుగు పడి కౌలు రైతు మృతి

కోటబొమ్మాళి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పిలపాడు గ్రామానికి చెందిన డొక్కరి వీరాస్వామి (42) అనే కౌలు రైతు బుధవారం పిడుగు పడి మృతి చెందాడు. వీరాస్వామి పొలంలో పని చేస్తుండగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వీరాస్వామికి భార్య శాంతి, కుమారుడు జశ్వంత్, కుమార్తె జోత్న ఉన్నారు. వీరాస్వామి స్వగ్రామం సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు. కొన్నేళ్ల కిందట అత్తవారి ఊరు దుప్పిలపాడుకు ఇల్లారికం వచ్చాడు. సుమారు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని భార్య శాంతితో కలిసి సాగుచేస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. వీరాస్వామి మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానిక వీఆర్వో పేడాడ అకిల్ శవ పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం కోసం వీరాస్వామి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వీరాస్వామి మృతదేహం

లెక్క తేలింది

- నకిలీ దివ్యాంగుల జాబితా సిద్ధం
- మరో రెండురోజుల్లో సచివాలయాల్లో ప్రదర్శన
- జిల్లాలో 8వేల మందిపైగా అనర్హులు
- వీరికి ఆగస్టు నుంచి నిలిచిపోనున్న పింఛన్

● వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసన్నపేట మేజర్ పంచాయతీ పాలకమండలి సభ్యుడు ఒకరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కాళ్లు విరిగిపోవడంతో అప్పట్లో ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. ఆ సమయంలో దివ్యాంగుడినని చెప్పి సదరం ధ్రువపత్రం పొందారు. ప్రస్తుతం ఆయన కాళ్లు బాగున్నాయి. సక్రమంగా తన విధులు నిర్వహించుకుంటున్నారు. అయితే, తప్పుడు సదరం ధ్రువపత్రంతో ప్రస్తుతం ఆయన రూ.6వేలు దివ్యాంగ పింఛన్ పొందుతున్నారు.

● నరసన్నపేట పట్టణానికి చెందిన ఒక ఆసామికి చిన్నతనంలో చేయి విరిగిపోయింది. చేయి కొంచెం వంకరగా ఉంటుంది తప్ప అన్ని పనులు సక్రమంగా చేసుకోగలరు. అయితే, గత వైసీపీ ప్రభు త్వంలో తన పలుకబడి ఉపయోగించి సదరం ధ్రువపత్రం పొందారు. దానిద్వారా దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నారు.



నరసన్నపేటలో నిర్వహించిన సదరం ధ్రువపత్రాల పునఃపరిశీలన శిబిరానికి వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

నరసన్నపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సదరం ధ్రువపత్రాల జారీలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాలు వంకర.. చేయి వంకర అని.. చెవులు వినిపించడం లేదని.. కళ్లు సరిగాకనిపించడం లేదని.. మానసిక వైకల్యమంటూ చాలామంది సకలాంగులు సదరం ధ్రువపత్రాలను పొందారు. అప్పట్లో వైసీపీ నాయకుల సిఫారసులతో కొంతమంది వైద్యులు ఈ సదరం ధ్రువపత్రాలను జారీ చేశారు. మరికొందరు డాక్టర్లు తమ చేతివాటం చూపించి సకలాంగులకు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జిల్లాలో ఈ నకిలీ ధ్రువపత్రాలతో చాలామంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. నరసన్నపేట, ఇచ్ఛాపురం, రణస్థలం సామాజిక ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా సదరం ధ్రువపత్రాలు జారీ చేసిన విషయం వెలుగులో వచ్చింది.

చర్యలకు ఉపక్రమించిన ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీ సదరం ధ్రువపత్రాలపై చర్యలకు ఉపక్రమించింది. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులతో సదరం పత్రాల పునఃపరిశీలన కార్యక్రమం చేపట్టింది. గతేడాది అక్టోబరు నుంచి ఈ నెల మూడో వారం వరకూ ఈ కార్యక్రమం కొనసాగింది. దీంతో చాలా మంది సవ్యాంగులు (మిగతా 6వ పేజీలో..)



శ్మశాన స్థలంలో వెలసిన భవనాలు

శ్మశానాన్నీ వదల్లే..

- తర్లాకోట రాజుల రుద్రభూమి ఆక్రమణ
- 29 సెంట్లకు తొమ్మిది సెంట్లే మిగిలిన వైనం
- అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు

పలాసరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లాకోటలో శ్మశానం ఆక్రమణకు గురవుతోంది. గతంలో 127/18 సర్వే నెంబరులో 29 సెంట్ల విస్తీర్ణంలో శ్మశానం ఉండగా, ఇప్పుడు ఆక్రమణలతో కేవలం 9 సెంట్లు మాత్రమే మిగిలింది. పూర్వకాలం తర్లాకోట సంస్థానాధీశులు ఈ భూమిని శ్మశానంగా వినియోగించుకునేవారు. దీన్ని స్థానికులు రాజుల శ్మశానంగా పిలుస్తుంటారు. అయితే, నాలుగేళ్ల కిందట ఈ భూమిపై ఓ బడా బాబుతో పాటు సామాన్య వ్యాపారుల కళ్లుపడ్డాయి. అప్పటి నుంచి శ్మశానం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో గతంలో 29 సెంట్లు ఉన్న శ్మశానం ఇప్పుడు తొమ్మిది సెంట్లు మాత్రమే ఉంది. దీనిపై ఇటీవల గ్రామస్థులు డీటీకి ఫిర్యాదు చేశారు. కనీసం తర్లాకోట సంస్థానాధీశుల శ్మశానమైనా నాటి ఆనవాళ్లుగా భావించి రక్షించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఎస్.కళ్యాణచక్రవర్తిని వివరణ కోరగా.. రాజుల శ్మశానం ఆక్రమణపై గ్రామస్థులు వినతిపత్రం అందించారని, ఆ స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న తర్లాకోట గ్రామస్థులు(ఫైల్)

టీడీవలసను వీడని జ్వరాలు

- కీళ్ల నొప్పులు, దద్దుర్లతో ఇబ్బందులు పడుతున్న రోగులు
- నెల రోజులుగా ఇదే పరిస్థితి
- ఆసుపత్రులకు వెళ్లినా నయం కాని వైనం



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో, యువకుడికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జి.సిగడాం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీటీవలస గ్రామాన్ని జ్వరాలు వీడటం లేదు. నెల రోజుల నుంచి గ్రామంలో చాలామంది కీళ్ల నొప్పులు, తిమ్మిర్లు, కాలు పొంగులు, దద్దుర్లతో బాధపడుతున్నారు. ప్రతి ఇంటిలో జ్వర బాధితులు ఉన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నా రోగాలు తగ్గడం లేదని గ్రామానికి చెందిన టంకాల రాంబాబు, టంకాల తిరుపతిరావు, టంకాల సాయమ్మ తదితర జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజల కిందట గ్రామంలో పలువురికి వైరల్ జ్వరాలు వచ్చాయన్నారు. గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు నిత్యం పారిశుధ్య పనులు, ఫాగింగ్, దోమల మందు పిచికారి చేస్తున్నా రోగాలు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి వైద్యాధికారులతో మెరుగైన వైద్యసేవలు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి..

డీటీవలసలో డీపీవో సౌజన్య భార్గవి బుధవారం పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు (మిగతా 6వ పేజీలో..)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో అనిత

7లో

ముంచెత్తిన వాన

6లో



నరసన్నపేట బజారు వీధిలో వరద

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి

7లో

ఎరువుల కోసం రైతుల తోపులాట

- పంపిణీ వాయిదా

7లో

పడవ బోల్తాపడి మత్స్యకారుడి మృతి

- క్షేమంగా ఒడ్డుకు చేరిన మరో నలుగురు
- బందరువానిపేట తీరంలో ఘటన

గార/రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు తమతో ప్రయాణించి చేపల వేట చేసిన వ్యక్తి విగతజీవిగా మారడాన్ని తోటి మత్స్యకారులు జీర్ణించుకోలేకపోతున్నారు. భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని.. ఇక తమకు దిక్కెవరంటూ మృతుడి భార్య రోదిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. పొట్టకూటి కోసం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు బోటు బోల్తాపడడంతో మృతి చెందిన ఘటన బందరువానిపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గార ఎస్ఐ సీహెచ్ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బందరువానిపేటకు చెందిన బడి గజేంద్ర (55), పుక్కల కృష్ణ, గుళ్ల ప్రసాద్, పుక్కల లక్ష్మణ, మైలపిల్లి సూర్యనారాయణ కలిసి పడవపై బుధవారం వేకువజామున చేపలవేటకు సముద్రంలోకి వెళ్లారు. వేట ముగించుకొని తిరిగి వస్తుండగా అలల ఉధృతికి పడవ బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్న (మిగతా 6వ పేజీలో..)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గజేంద్ర (ఫైల్)

మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం

- మత్స్యకారులు భద్రత చర్యలు తీసుకోవాలి
- మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జూలై 23(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మృతి చెందిన బందరువానిపేటకు చెందిన మత్స్యకారుడు బడి గజేంద్ర కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో గజేంద్ర కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ.5లక్షలు మంజూరు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని.. ఈవిషయమై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి దుఃఖంలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి భరోసా ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణం స్పందించి సాయం చేశారని తెలిపారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. వార్షిక క్రెడిట్ ప్లాన్ 2024-25, ఎంఎస్ఎంఈ, విద్యా రుణాలు, వ్యవసాయానికి క్రెడిట్, చెల్లింపులు, స్వయం సహాయక సంఘాల గ్రూపులకు లింకేజీ అండ్ ఎంసీపీ డిజిటల్, పీఎం సూర్యఘర్, పీఎం విశ్వకర్మ, నాబార్డు తదితరాల లక్ష్యాలను, సాధించిన తీరును విశ్లేషించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్స్యశాఖ, ఎంఎస్ఎంఈ, ఉద్యాన శాఖ, తదితర శాఖల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. సూర్యఘర్ ఎక్కువ మందికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అలాగే నైపుణ్యాభివృద్ధి శాఖతో సంబంధం ఉన్న ప్రతీ శాఖ సమన్వయంతో ఆయా శాఖలకు సంబంధించిన శిక్షణ తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఒకసారి నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థను సందర్శించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాసరావు బ్యాంకర్లకు (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్మార్ట్‌గా రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- పాతకార్డుల స్థానంలో కొత్తవి
- నేతల ఫొటోలు లేకుండా ప్రింటింగ్
- జిల్లాలో 67,313 దరఖాస్తులు

మొత్తం అందిన దరఖాస్తులిలా..

చిరునామా మార్పుకోసం	1,562
ఆధార్ సీడింగ్ దిద్దుబాటు	1,119
కొత్తగా పేర్లు నమోదు కోసం	47,889
తొలగింపు	1,485
కొత్త కార్డుల కోసం	6,773
విభజన	6,832
సరెండర్ చేసిన వారు	38
పేర్లను సరిచేసుకునేందుకు	562
ఎఫ్‌పీ షాపు రెన్యువల్స్	1053

శ్రీకాకుళం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల రూపరేఖలు మారబోతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్‌కార్డులు తయారవుతున్నాయి. పార్టీల రంగులు, నాయకుల ఫొటోలకు లేకుండా సిద్ధమవుతున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డును మాదిరి క్యూఆర్ కోడ్‌తో రూపొందుతున్నాయి. రేషన్‌కార్డుపై ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుల ఫొటో మాత్రమే ఉండేలా పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తిచేసింది. కార్డుపై ఓ వైపు కుటుంబ పెద్ద ఫొటో మరోవైపు ప్రభుత్వ అధికారిక ముద్ర ఉంటాయి. రేషన్ కార్డు నెంబర్, రేషన్ షాపు నెంబరు, లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. ఈ రేషన్‌కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ మెషిన్ సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలు, సరుకుల వివరాల పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. ముద్రణదశలో ఉన్న స్మార్ట్ రేషన్‌కార్డులను నెలాఖరులోగా లేదా ఆగస్టు మొదటివారంలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

వైసీపీ హయాంలో పార్టీ రంగులు

గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుకు పార్టీ రంగులు పులిమింది. కార్డుపై ఓవైపు అప్పటి సీఎం జగన్ బొమ్మ, పక్కనే మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మ ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. అక్కడితో ఆగకుండా దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న రేషన్‌డిపోల వ్యవస్థకు మంగళం పాడింది. డిపోలపైనే ఆధారపడే వందలాది మంది ఉపాధిని దెబ్బతీసింది. నేరుగా ఇంటికే రేషన్ సరుకులంటూ ప్రచారం ఊదరగొట్టింది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చుచేసి వందలాది ఎండీయూ వాహనాలను కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతల్ని పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులకు అప్పగించి వారికి నెలకు రూ. 22 వేల వంతున చెల్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసింది. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను, రాష్ట్ర ఖజానాపై భారంపడే పథకాలకు మంగళం పాడింది. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సారథ్యంలో స్మార్ట్ రేషన్‌కార్డుల తయారీకి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో దరఖాస్తులు ఇలా..

జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం 67,313 దరఖాస్తులు అందాయి. తమ కుటుంబ సభ్యులను రేషన్‌కార్డుల్లో చేర్పించాలని వచ్చిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. వివాహమైన వారు, ఇటీవల జన్మించిన తమ పిల్లల పేర్లను కార్డులో జోడించాలని దరఖాస్తు చేసుకున్నారు కొత్తగా బియ్యంకార్డుల మంజూరు, ఉన్నవాటిలో మార్పులు, చేర్పుల కోసం సచివాలయాల ద్వారా గత ఏడాది జూన్ 16 నుంచి ఈ ఏడాది జూలై 18 వేలాది దరఖాస్తులు అందాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్పించాలని వచ్చిన దరఖాస్తులే 47,889 ఉన్నాయి. కార్డుల విభజనతో పాటు కొత్తకార్డుల కోసం దరఖాస్తులు అందాయి. కొత్తకార్డు, సభ్యుల పేర్ల నమోదు, తొలగింపు, విభజన, సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటు వంటి ఏడురకాల సేవల్ని సచివాలయాల ద్వారా కల్పించారు. దీంతో మొత్తం 67,313 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తయింది

జిల్లా వ్యాప్తంగా 67,313 దరఖాస్తులు అందాయి. ఇందులో అత్యధిక శాతం పరిశీలన పూర్తిచేశాం. సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల్ని అందజేస్తాం. 3,491 దరఖాస్తులు మాత్రమే క్లియర్ చేయాల్సిఉంది. దరఖాస్తు కోసం తుదిగడువు లేకపోవడంతో నిరంతర ప్రక్రియగా మారింది. దీంతో విడతల వారీగా పంపిణీ ప్రక్రియ సాగుతుంది.

- జి.సూర్యప్రకాశరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి, శ్రీకాకుళం


పాత రేషన్ కార్డులు

లెక్క తేలింది

(ఐదో పేజీ తరువాయి)

నకిలీ సదరం ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్టు గుర్తించారు. జిల్లాలో ప్రస్తుతం 31,584 మంది దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. వీరిలో మంచం మీద నుంచి కదలలేనిస్థితిలో ఉన్నవారికి నెలకు రూ.15వేలు చొప్పున, మిగతా వారికి నెలకు రూ. 6వేలు చొప్పున పంపిణీ చేసేవారు. అయితే, వీరిలో దాదాపు 40 శాతం మంది నకిలీ పత్రాలతో దివ్యాంగులుగా చలామణి అవుతూ పింఛన్ పొందుతున్నట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లో నకిలీ దివ్యాంగుల గుట్టు రట్టు కానుంది. ఈ జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఇంకా ఎవరైనా అనర్హులు దివ్యాంగ పింఛన్ పొందుతున్నట్లయితే అధికారులు గుర్తించి ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వాలి. వారిపేర్లను మరోమారు సదరం క్యాంపులో పునఃపరిశీలన చేస్తారు. వడపోతలో వారిపేర్లు ఏ విధంగా తప్పిపోయాయో తెలుసుకొని, ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించి.. సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

సచివాలయాల్లో అనర్హుల జాబితా

నకిలీ దివ్యాంగుల జాబితాను మరో రెండు రోజుల్లో సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. అనర్హులుగా ప్రకటించడానికి గల కారణాలను అందులో తెలియజేస్తారు. ప్రతి సచివాలయం పరిధిలో సుమారు 20 మంది వరకు అనర్హులు ఉండే అవకాశం ఉంది. వీరికి వచ్చే నెల (ఆగస్టు) నుంచి పింఛన్ నిలిపివేయనున్నారు. రాష్ట్రంలో 1.10 లక్షల మందిని అనర్హులుగా గుర్తించారు. జిల్లాలో కూడా సుమారు 8 వేలకు పైగా గుర్తించినట్లు సమాచారం. ఇన్నాళ్లు నకిలీ ధ్రువపత్రంతో పొందిన పింఛన్ సొమ్మును కూడా రికవరీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు బుధవారం సంకేతాలు రావడంతో నకిలీ దివ్యాంగుల గుండెల్లో దడ మొదలైంది.

పడవ బోల్తాపడి మత్స్యకారుడి మృతి

(ఐదో పేజీ తరువాయి)

వారంతా నీటిలోకి పడిపోయారు. ఐదుగురూ సముద్రంలో ఈదుకుంటూ ఒడ్డుకు వస్తున్న సమయంలో గజేంద్రకు ఆయాసం వచ్చింది. దీంతో ఈదలేక మునిగిపోవడాన్ని మిగతా మత్స్యకారులు గమనించారు. అతను ఉన్న ప్రదేశానికి వెళ్లి నీటిలో మునిగిపోయిన గజేంద్రను బయటకు తీసి చూసేసరికి ప్రాణంపోయింది. గజేంద్ర మృతదేహాన్ని పట్టుకొని ఈదుతూ, ఒకరికొకరు సహకరించుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజేంద్రకు భార్య పోలమ్మ, ముగ్గురు కుమార్తెలతో పాటు దివ్యాంగుడైన కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం అయింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీవలసను వీడని జ్వరాలు

(ఐదో పేజీ తరువాయి)

తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎక్కడా అపరిశుభ్రత కనిపించరాదని అన్నారు. మురికి కాలువల్లో పూడికలు తీయించి, పెంట కుప్పలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థులు కూడా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ, వైద్యాధికారి యశ్వంత్, గ్రామ సచివాలయ, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నాం

గ్రామంలో జ్వరాలు ప్రబలినప్పటి నుంచి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి రోగుల పరిస్థితిపై ఆరా తీసి మందులు అందిస్తున్నాం. అవసరమైన వారికి సెలైన్‌లు పెడుతున్నాం. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో నిత్యం ఉంటున్నారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందిస్తున్నాం.

- యశ్వంత్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, జి.సిగడాం


నరసన్నపేట: గొట్టిపల్లి పరిసర పొలాల్లో వర్షపునీరు


కోటబొమ్మాళి: కొత్తపేట కూడలి వద్ద ..


హరిపురం: మఖరజోల వద్ద కురుస్తున్న వర్షం

ముంచెత్తిన వాన

నరసన్నపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండపంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడ తెరపిలేకుండా వర్షం పడటంతో పొలాలు జలమయమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాలు వరద నీటిలో మునిగాయి. బజారువీధి, కలివరపుపేట, జోగిపేట జంక్షన్, మెయిన్‌రోడ్డు మీద వరదనీరు రోడ్డుపై ప్రవహించింది. గొట్టిపల్లి- కంబకాయి జంక్షన్ వద్ద గల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ వర్షం వరి పొలాలకు ఎంతో ఉపయోగకరమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ జలమయమైంది.

కోటబొమ్మాళిలో...

కోటబొమ్మాళి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, కొత్తపేట జంట గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలోకి నీరు చేరి మొరాయించడంతో వాహనదారులు వాటిని తోసుకుంటూ నీటిలోనే వెళ్లారు. కొత్తపేట జంక్షన్ వద్ద బ్రిడ్జి పక్కన ఉన్న సర్వీసు రోడ్లుపై నీరు ఎక్కువగా చేరడంతో వాహనదారులు అష్టకష్టాలు పడ్డారు.

ఎల్ఎన్ పేటలో...

ఎల్ఎన్ పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో కురిసిన భారీవర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సుమంతాపురం, కృష్ణాపురం, కరకవలస, శ్యామలాపురం, కవిటి, కుసుములపాడు తదితర గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హరిపురంలో...

హరిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): హరిపురం పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. వర్షాలకు నీటి వనరుల్లో నీరు చేరి పంటపొలాలకు ఉపయోగకరంగా మారుతుందని రైతుల ఆశ. ఇప్పటికే సునాముది, మహేంద్రతనయ నదిలో ప్రవాహ స్థాయి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నందిగాంలో...

నందిగాం, జూలై 23(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలంలో బుధవారం కురిసిన వర్షంతో ప్రజలు, రైతులు ఊరట చెందారు. సుమారు గంటన్నర పాటు పడిన వర్షం అన్ని ప్రాంతాలకు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల ఎండల తీవ్రతతో ఎదలు, వరినారుమళ్లు ఎండిపోయాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఈ సమయంలో కురిసిన వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపింది. వరి నారుమళ్లకు ఊపిరి పోసినట్లయింది.

హిరమండలంలో...

హిరమండలం, జూలై 23(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది.పంటపొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్లలోకి చేరిన వర్షపునీరు



కంచిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీపీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. ఎగువ ప్రాంతంలో ఉన్న హైస్కూల్ చుట్టుపక్కల నుంచి వర్షం నీరు కాలనీలో రోడ్లపై ప్రవహించి ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఇళ్లలోకి చేరిన నీటిని పాత్రలతో బయటకు తోడారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎ.రాంబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇచ్ఛాపురంలో..



ఇచ్ఛాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో బుధవారం సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు ప్రవహించి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజులుగా ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా ఉక్కపోతకు గురైన ప్రజలు భారీ వర్షంతో కొంతమేర ఉపశమనం పొందారు.

ఇలా అయితే... బడికి పోయేదెలా?

నరసన్నపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బసివలస పాఠశాల ముందుభాగంలో చెరువును తలపిస్తోంది. ఈ నీటిలో దిగి పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజ్ లేపోవడంతోనే నీరు ప్రవహించేందుకు మార్గం లేకుండాపో తోంది. ఈ విషయమై హెచ్ఎం బాబూరావు వద్ద ప్రస్తావించగా.. పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చామని తెలిపారు.





చెరువు కాదు.. రోడ్డే

సరుబుజ్జిలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం పలు ప్రాంతాల్లో భారీవర్షం కురి సింది. ప్రధానంగా అలికాం-బత్తిలి ప్రధాన మార్గంలో సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేట వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల రోడ్డంతా గోతులతో నిండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారితో పాటు బస్ స్టేషన్ ప్రాంతం కూడా నీటితో నిండిపోయి చెరువును తలపించింది. దీంతో రాకపోకలు సాగించే వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.

భాషాభివృద్ధికి 'ఆరవెల్లి' విశిష్ట సేవలు


ఆరవెల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధికి ఆరవెల్లి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ పండితులు ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు 3వ వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక ఉపనిషన్మందిరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆర్ష సాహిత్యంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు నిష్టల నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు డా.సనపల నారాయణమూర్తి మాట్లాడుతూ.. ఆధ్యాత్మికవేత్తగా, ఉపాధ్యాయుడిగా ఎంద రికో మార్గదర్శకులయ్యారన్నారు. ఉపనిషన్మందిరం పురోభివృద్ధిలో ఎనలేని సేవ చేసిన ఆరవెల్లి భావి తరాలకు స్ఫూర్తి అని అన్నారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు జంధ్యాల శరత్‌బాబు, పి.రామ్ మనోహర్, పట్నాయక్, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు, అప్పారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

(ఐదో పేజీ తరువాయి)

సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, మత్స్యకారులకు, పశు సంవర్థక శాఖలకు సంబంధించి రుణాలు అందిస్తామని నాబార్డు డీడీ ఎం.రమేష్ కృష్ణ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతీ కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్త ఉండే విధంగా బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు. పీఎం ఫసల్ బీమా యోజనలో ప్రతీ రైతు చేరాలని, ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే బీమా ఉపయోగపడుతుందని అన్నారు. సమావేశంలో యబీఐ ప్రాంతీయా ధికారి పి.రాజు, డీసీసీబీ జీఎం వరప్రసాద్, ఉద్యానశాఖ ఏడీ ప్రసాదరావు, మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి త్రినాథ స్వామి, బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




ఆదిత్యాలయం.. మబ్బుల సోయగం

అరసవల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యదేవుని ఆలయాన్ని మబ్బులు కమ్మేశాయి. బుధవారం సాయంత్రం వర్షం పడుతున్న వేళ.. నీలాకాశంలో తేలియాడే మేఘాల సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. మబ్బుల నీడలు ఇంద్ర పుష్కరిణిలో అద్దంలో ప్రతిబింబంలా కనిపించాయి.

ఇలా ఉంటే ప్రమాదం కాదా?

శ్రీకాకుళం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు, స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకున్న దృశ్యాలు ఇవి. కళ్లేపల్లి గ్రామం దారిపొడవునా ఉన్న కిల్లిపాలెం వరకు ఎక్కడ చూసినా ఇలాంటివే కనిపిస్తాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఇలా అల్లుకుపోయిన తీగల వల్ల ప్రమాదాలు జరగవచ్చని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.





వండిందే మెనూ.. పెట్టిందే తిను

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులకు గుడ్డు ఇస్తున్నట్లు తెలుస్తుంది. ప్రతి నెల గుడ్లను కిరాణా వ్యాపారులకు విక్రయించి రూ.10వేలు వరకు హాస్టల్ నిర్వాహకులు సంపాదిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అరటి పండ్లు కూడా విద్యార్థులకు సక్రమంగా ఇవ్వడం లేదు. ఈ ఆశ్రమ పాఠశాలలో రెండేళ్ల నుంచి ఒక వ్యక్తే వార్డెన్‌గా కొనసాగుతున్నారు. మిగతా ఆశ్రమ పాఠశాలల్లో ప్రతిఏటా వార్డెన్ల మార్పు ఉంటుంది. కానీ, ఇక్కడ మాత్రం రెండేళ్ల నుంచి ఒక్కరే వార్డెన్‌గా పని చేస్తుండడంపై పలు విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. గతంలో టెక్కలి సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన రాహుల్ కుమార్‌రెడ్డి పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పుడు అనేక లోటుపాట్లు కనిపించాయి. దీంతో అప్పట్లో హెచ్ ఎంగా ఉన్న ప్రసాదరావును సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కానీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పాఠశాల పరిస్థితి మారలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని అన్ని గిరిజన వసతి గృహాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

గుడ్డు ఇవ్వలేదు

ఉడక పెట్టిన గుడ్డు మంగళవారం ఇవ్వడంలేదు. సోమవారం రాత్రి ఇచ్చారు. కూరలు చప్పగా ఉంటున్నాయి. భోజనం చేయాలంటే ఇబ్బందిపడుతున్నారు.

- ఓ విద్యార్థి, ఆరో తరగతి, పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాల

కూరలు చాలడం లేదు

మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. కూరలు సరిపోవడం లేదు. ఇళ్ల నుంచి తీసుకువచ్చిన పచ్చడి, కారం మిక్సర్‌తో అన్నం తింటున్నాం. పప్పు కూడా చప్పాగా ఉంటుంది.

-ఓ విద్యార్థి, తొమ్మిదో తరగతి, పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాల

పర్యవేక్షణ కరువు..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో సహాయ గిరిజన సంక్షేమ అధికారుల (ఏటీడబ్ల్యూవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సీతంపేట, మెళియాపుట్టి, మందస పరిధిలోని ఆశ్రమ పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది. ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది వార్డెన్లు మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. వారికి నచ్చిన విధంగా విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. ప్రస్తుతం మెళియాపుట్టి, సీతంపేటలో ఏటీడబ్ల్యూవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోగా పనిచేసిన కృష్ణవేణి కొన్ని నెలల కిందట డెప్యూటేషన్ పార్వతీపురం డీడీగా వెళ్లిపోయారు. మందస ఏటీడబ్ల్యూవోగా పనిచేసిన శ్రీనివాసరావు ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అరకు నుంచి అనంతగిరి అనే వ్యక్తి మందస ఏటీడబ్ల్యూవోగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అనంతగిరికి డెప్యూటేషన్‌పై బదిలీ జరిగి నప్పటికీ ఐటీడీఏ పీవో మాత్రం ఆయన్ను రిలీవ్ చేయ లేదు. మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోగా లాభర పాఠశాల హెచ్ఎం సూర్యనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే వసతి గృహాలను ఆయన పరిశీలించే పరిస్థితి కనిపించడం లేదు.

చర్యలు తీసుకుంటాం

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం. పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు కాకపోవడంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం.

- సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

● సీఎం చంద్రబాబును కోరిన ఎన్ఈఆర్



రణస్థలం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందించారు. మడ్డువలస ఫేజ్-2, తోటపల్లి రెండో దశ పనులకు నిధుల మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ నిధులు మంజూరుచేస్తామని హామీ ఇచ్చారన్నారు. సీఎం సహాయ నిధి కింద రూ.20 లక్షలను మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే పనితీరు, సమస్యలపై స్పందించిన తీరును సీఎం అభినందించారన్నారు.

వైసీపీ హయాంలో విధ్వంసకర పాలన



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఆమదాలవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్రంలో ఐదేళ్లపాటు విధ్వంసకర పాలన సాగిందని, ఇసుక, లిక్కర్ దందాలు చేసిన ఆ పార్టీ నేతలు ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగిస్తామంటే ప్రజల చేతిలో దండన తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆమదాలవలసలో ఆరు గ్రూపుల వైసీపీ నాయకులు అక్రమార్జన కొనసాగించాలనే ధ్యాస తో ప్రభుత్వ అనుమతులతో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌లపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను, కూటమి నాయకులను విమ ర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఇటువంటి వాటికి స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు సంపతిరావు మురళీధరరావు, నూకరాజు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి, పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, కార్మిక సంఘ నేతలు

ఎచ్చెర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): అరిణాఅక్కివలసలోని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కార్మికులు గొర్లె చిట్టిబాబు, బోనంగి భాస్కరరావు కుటుంబ సభ్యులకు కార్మికులు ఒకరోజు వేతనంతో పాటు గ్రాట్యుటీని అందించారు. ఈ మేరకు బుధవారం గొర్లె పద్మావతికి రూ.11.47 లక్షలు, బోనంగి ఆదిలక్ష్మికి రూ.11.34 లక్షల చొప్పున చెక్కులను పరిశ్రమ ఉపాధ్యక్షుడు సీఆర్ శ్రీనివాస్, హెచ్‌వీడీ హెడ్ కె.శ్యాం సుందరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో పరిశ్రమ వర్కర్ల యూనియన్ నేతలు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎల్.చిరంజీవి, సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్య సంగ్రామంలో తిలక్‌ది కీలకపాత్ర

శ్రీకాకుళం కల్చరల్ జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వరాజ్య సంగ్రామంలో లోకమాన్య బాలగంగాధర తిలక్‌ది కీలకపాత్ర అని వక్తలు అన్నారు. తిలక్ 169వ జయంతిని స్థానిక గాంధీ స్మృతి వనంలో బుధవారం నిర్వహించారు. తిలక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అతివాద భావ జాలంతో ఉద్యమాన్ని ఉధృతం చేసి స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన మహోన్నత వ్యక్తి తిలక్ అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిరం ప్రతినిధులు నటుకుల మోహన్, నిష్టల నర్సింహమూర్తి, డా.చింతాడ కృష్ణమోహన్, డా.మందుల మోహనరావు, నక్క శంకరరావు, శాస్త్రి, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌వో గుర్తింపునకు సమన్వయంతో పనిచేయాలి

ఎచ్చెర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపునకు వర్సిటీలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఐఎస్‌వో గుర్తింపు, గ్రీన్ ఆడిట్ కోసం రెండు రోజుల పాటు జీసీ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పరిశీలన, అవగాహన అనంతరం బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, జీసీ కన్సల్టెన్సీ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ వికాస్ శ్రీ వాత్సవ్, వర్సిటీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో పనిచేస్తున్న ఓపీ లిఫ్టులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లిఫ్ట్‌లో వెళుతున్న దృశ్యం

శ్రీకాకుళం రిమ్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో లిఫ్టులు పనిచేస్తున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో లిఫ్టులు పనిచేయడం లేదని వచ్చిన కథనానికి సంబంధిత అధికా రులు స్పందించారు. ఆసుపత్రి ఓపీ భవనం వద్ద గల రెండు లిఫ్టులను బాగు చేసి వినియో గంలోకి తీసుకువ చ్చారు. దీంతో రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో అత్యంత కీలకమైన ఐపీ వద్ద రెండు, ప్రసూతి వార్డు వద్ద ఉన్న లిఫ్టు ఇప్పటికీ పనిచేయడం లేదు. దీంతో గర్భిణులు, రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని కూడా వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

● ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి

పాత శ్రీకాకుళం/అరసవల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటివల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీలు భారం పడదని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుకు అదనంగా ఎలాంటి చార్జీలు లేవని, స్మార్ట్ మీటర్ అమర్చినప్పుడు ఎటువంటి డిపాజిట్, మామూళ్లు, అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. బిల్లులతో పాటు ఏవైనా ఇన్‌స్టాల్‌మెంట్ చార్జీలు వసూలు చేయడం జరగదని స్పష్టం చేశారు. ఈ మీటర్లు ఎక్కువ యూనిట్లు చూపుతాయన్న ప్రచారం అపోహ మాత్రమే అన్నారు. విని యోగదారుల యాప్ ద్వారా 24/7 వినియోగాన్ని నియంత్రించుకునే అవ కాశం ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు పూర్తిగా ఏపీఈఆర్సీ నిర్దేశించిన టారిఫ్ ప్రకారమే వసూలు చేస్తామని తెలిపారు. వినియోగించిన యూనిట్లు, చార్జీల వివరాలను మొబైల్ నెంబర్‌కు పంపిస్తామన్నారు. దీనివల్ల వినియోగదారులకు ఖర్చుపై నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఎటు వంటి సందేహాలున్నా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

పొందూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వెబ్‌ఆధారిత కౌన్సిలింగ్‌లో మేలో జరిగిన బదిలీలలో కొత్త పాఠశాల్లో చేరిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేలా చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ఒక ప్రకటనలో కోరారు. బదిలీల్లో కోరుకున్న పాఠశాలకు బదిలీ అయినప్పటికీ రిలీవర్ రాలేదన్న నెపంతో రిలీవ్ చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. రిలీవ్‌కాని ఉపాధ్యాయుల స్థానంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమించి విద్యాబోధనకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ఎరువుల కోసం రైతుల తోపులాట

● పంపిణీ వాయిదా



రొట్టవలస సచివాలయం వద్ద రైతుల మధ్య తోపులాట దృశ్యం

సరుబుజ్జిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రొట్టవలస గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ఎరువుల పంపిణీ చేపడుతున్నట్లు సమాచారం రావడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి చేరుకున్నారు. అయితే రెండు వర్గాల మధ్య ఎరువుల పంపిణీలో వివాదం ఏర్పడి తోపులాటకు దారి తీసింది. ఆ వివరాలిలా ఉన్నాయి.. వ్యవసాయాధికారులు 440 యూరియా బస్తాల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. అయితే అప్పటికే కొంతమంది రైతులు యూరియా కొనుగోలుకు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలతో తమ పేరు నమోదు చేసుకున్నట్లు తెలపగా అదే సమయంలో గ్రామానికి చెందిన మరికొందరు రైతులు అక్కడికి చేరుకుని మాకు యూరియా బస్తాలు కేటాయించాలని కోరారు. ముందుగా నమోదు చేసుకొని క్యూలో ఉన్న రైతులకు యూరియా అందించిన తర్వాతే మిగిలిన వారికి ఇవ్వాలని ఒక వర్గం, రెండు వర్గాలకు సమానంగా పంపిణీ చేయాలని మరో వర్గం అధికారులపై ఒత్తిడి చేశారు. దీంతో ఇరువర్గాల రైతుల మధ్య వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి. దీంతో అక్కడ ఉద్రిక్త ఏర్పడడంతో విషయం తెలుసుకున్న సరుబుజ్జిలి పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి నచ్చచెబుతున్న సమయంలో సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల రమణపై ఒక కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు, సర్పంచ్ వర్గం మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులు, పోలీసులు నచ్చజెప్పినప్పటికీ ఇరువర్గాల రైతులు వినకపోవడంతో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రకటించారు.

ఆక్రమణలను పరిశీలించిన జేసీ



ఆక్రమణలను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జి.సిగడాం, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట పంచాయతీ నక్కపేట గుంటుకువాని చెరువు, మర్రిబంద, శ్మశాన వాటిక, గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు గట్టుపై ఆక్రమణలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం పరిశీలించారు. ఈ ఆక్రమణలపై ఇటీవల గ్రామ రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన పరిశీలించి ఆక్రమణ దారులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఈ చెరువు గట్టుపై నివసిస్తున్నామని, వ్యవసాయ పనిముట్లు ఉంచడం, మూగ జీవాలకు ఆశ్రయం కోసం వాడుకుంటున్నామని, ఆక్రమణలకు పాల్పడలేదని, న్యాయం చేయాలని వారు కోరారు. ఈ మేరకు ఆక్రమణదారులు, గ్రామస్థుల నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదుచేసి నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వాని అందిస్తామన్నారు. చెరువులను పరిరక్షించే బాధ్యత మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలపై ఉందన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉండడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సరిత, ఆర్ఐ ఆబోతుల రాధ ఉన్నారు.

రేపటి నుంచి శ్రావణమాసోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాలు ఈనెల 25 నుంచి ప్రారంభంకానున్నాయి. 25న మొదటి శ్రావణ శుక్రవారం పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వచ్చేనెల 8న మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారని పండితులు తెలిపారు. 15న నాల్గవ శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహిస్తారు. పాత శ్రీకాకుళం సంతోషిమాత ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, నగరంలో ఉన్న వేంకటేశ్వర స్వామి, విజయ దుర్గ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, జీకేవలస, కొరపాం, చేపేనపేట, రామచంద్రాపురం, చిట్టివలస, చెవ్వాకులపేట గ్రామాల్లో విద్యుత్ పనులు, విద్యుత్‌లైన్లు మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనుల వల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల మండలంలో..

ఎచ్చెర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కేవీ ఫరీద్‌పేట, ఎస్ఎంపురం, కొయ్యరాళ్లు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో పీఎంఐ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో డా.అనిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత

అరసవల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు సోకే అవ కాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలుతా యన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఆరోగ్యశాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ, మున్సిపల్, పంచాయతీ శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నామన్నారు. తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో నీటి పరీక్షలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో దోమల నివారణకు డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేపట్టనున్నామని తెలిపారు. వర్షాకాలంలో ఎక్కువగా అతిసార, టైఫాయిడ్, పచ్చ కామెర్లు వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ రాందాసు, ఎస్పీ రామనాగేశ్వరరావు, ఏవో బాబూరావు, డిప్యూటీ డెమో ఎం.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయింపు



స్థలాన్ని అప్పగిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

లావేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చిగిరికొత్తపల్లి పంచాయతీ వెంకటరావుపేట శ్మశానవాటిక ఏర్పాటుకు ఎట్టకేలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. ఇప్పటి వరకు ఓ ప్రైవేటు స్థలంలో దహన సంస్కారాలు చేసేవారు. నెలరోజుల కిందట ఓ వృద్ధురాలు మృతి చెందితే ఆ స్థలంలో దహన సంస్కారాలకు సంబంధిత స్థల యజమాని అడ్డగించిన సంగతి తెలిసిందే. అప్పుడు రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా వేరే చోటు చూపించగా ఒకరోజు ఆలస్యంగా కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ గురుగుబిల్లి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి గ్రామంలోని సర్వే నెంబరు 434లో 4 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి కేటాయించారు. ఈ స్థలాన్ని తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ, ఉపాధి సిబ్బంది బుధవారం పరిశీలించి గ్రామస్థులకు అప్పగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతులపై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం సాగులో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ టి.భవానీ శంకర్ అన్నారు. బుధవారం తేలుకుంచి, తులసిగాం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినాట్లను పరిశీలించి అవగాహన కలిగించారు. ఆకు చివర్ల కత్తిరింపు, కలుపు నివారణ, పిచికారి వంటి అంశాల్లో సాంకేతిక పద్ధతులను వివరించారు. తేలుకుంచి గ్రామంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సోంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ మంగరాజు కోరారు. మహిళా పోలీసులతో స్టేషన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ అంశాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ లవరాజు, సిబ్బంది ఉన్నారు.

27న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలు స్థానిక కొత్తరోడ్డు సమీపంలోని సీఎస్ఎస్ ట్రస్టు కార్యాలయంలో ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యుడు సనపల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ విజేతలు ఆగస్టు రెండు నుంచి విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 13 ఏళ్లలోపు క్రీడాకారులు అర్హులని, ఆసక్తిగల క్రీడా కారులు జనన ధ్రువీకరణ పత్రంతోపాటు రిజిస్ట్రేషన్ ఎపిచెస్.ఓఆర్జీ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9912559735 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగించాలి

అరసవల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి అన్నారు. అచ్యుతానందన్ సంతాప సభ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు, కమిటీ సభ్యులు ప్రసాదరావు, కె.సూర య్య, ఆదినారాయణమూర్తి, ఎన్‌వి.రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

శాకంబరిగా లక్ష్మీదేవి



శ్రీకాకుళం కల్చరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): బలగ అయ్యప్ప స్వామి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారు బుధవారం శాకంబరిగా దర్శనమి చ్చారు. అర్చకుడు దేవరకొండ శంకర్ నారాయణ శర్మ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు: డీఎస్‌వో

గార, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డీలర్లు నిబంధనలు పాటించాలని, ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో జి.సూర్య ప్రకాశరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల రేషన్ డిపోల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రెండు పూటలా రేషన్ డిపోలను తెరిచి ఉంచాలన్నారు. దివ్యాంగులు, వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి ప్రతి నెల 26న రేషన్ అందించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ చక్రవర్తి, సివిల్ సప్లై డీటీ అనిల్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా మహా లింగార్చన



అరసవల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత, అరసవల్లి సూర్య నారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో బుధవారం శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు సాందీప శర్మ అర్చన చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంపై విచారణ

సరుబుజ్జిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోనెపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంపై వస్తున్న ఆరోపణలపై బుధవారం బూర్జ సీడీపీవో గీత విచారణ చేపట్టారు. లబ్ధిపొందుతున్న సుమారు 15 మంది నుంచి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఇసుకాసురులను ఎదిరించండి

ఆమదాలవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రాత్రీ, పగలు తేడా లేకుండా ప్రభు త్వ నిబం ధనలు ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులను ఎది రించాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. ఇటీవల వివాదంగా మారిన నిమ్మతొర్లాడ ఇసుక ర్యాంప్ ప్రాంతాన్ని స్థానిక నేతలతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఇసుక ర్యాంపు అనుమతులు పూర్తయినప్పటికీ ఇచ్చిన అనుమతులు అధిగమించి భారీ స్థాయిలో తవ్వకాలు చేపట్టడం దారుణమన్నారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నేతలున్నారు.

రన్నింగ్ పోటీలో ప్రతిభ

కవిటి, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఆర్కే బీచ్‌లో ఎన్‌టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో ఈనెల 19న నిర్వహించిన రన్నింగ్ పోటీలో కవిటి మండలం నెలవంక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థిని బాగ దీక్షిత విజేతగా నిలి చింది. ఈ సందర్భంగా ఆమెను ఎంఈవో ధనుంజయ మజ్జి, హెచ్ఎం గంగయ్య, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.









కూటమి ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి


కేదారిపురంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పలాస రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి బాట పట్టాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కేదారిపురం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో పల్లెల్లో కనీసం రోడ్లు కూడా వేయలేక పోయారని, తమ ప్రభుత్వం పల్లెల రహదారులకు మహర్దశ కల్పించిందని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవతో రైతన్నలను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌదరి బాబ్జీ, పీరుకట్ల విఠల్, మల్లా శ్రీనివాసరావు, గంగారామ్, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజాదరణ

కాశీబుగ్గ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం వల్ల ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రజాదరణ పొందుతోందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల పదో వార్డులో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సవర రాంబాబు, గంధం కామేశ్వర రావు, కొండే నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన టీడీపీతోనే సాధ్యం

శ్రీకాకుళం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లి, పెద్దగనగళ్లవానిపేట గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. ప్రజలే నా బలం, బలగమని నేను అందరివాడినన్నారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు. పెద్ద గనగళ్లపేటలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సర్పంచ్ బర్రి రామారావు, ఎంపీటీసీ చీకటి అమ్మోజీరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీది మంచి పాలన

మెళియాపుట్టి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీది మంచి పాలన అని.. వైసీపీది విధ్వంస పాలన అని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి తెలిపారు. బుధవారం మారడికోటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, కోదండ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సభ్యుల అసహనం ఎవరిపైనో?

తమకు తెలియకుండా పనులు కేటాయింపులని అసంతృప్తి ● మున్సిపల్ సమావేశం నుంచి వాకౌట్


మున్సిపల్ సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

పలాస, జూలై 23(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ మెజార్టీ ఉన్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం ప్రతిపక్షంలో ఉన్నామన్న భావనలోనే ఉన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి అజెండా అంశాలు ఆమోదించాల్సి ఉండగా తమకు తెలియకుండానే వార్డుల్లో పనులు కేటాయించారని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం మొత్తం అజెండా రద్దు చేయాలని కోరుతూ డిసెంట్ తెలియజేశారు. ఇంతకీ ఈ అసహనం అధికార పార్టీ మీదా? మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై పూర్తి అసంతృప్తిగా ఉన్న చైర్మన్ బళ్ల గిరిబాబు మీదా? అన్నది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సభ ప్రారంభించిన కొద్ది నిమిషాలకే వైసీపీ కౌన్సిలర్లు, ఇద్దరు వైస్‌చైర్మన్లు మాట్లాడుతూ మొత్తం అజెండాలోని అంశాలు సభ్యులకు తెలియకుండా పెట్టారని, వార్డుల్లో తాము ఉన్నట్లా, లేనట్లా అంటూ కమిషనర్ ఎన్.రామారావును నిలదీశారు. అనంతరం వారంతా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. చైర్మన్, కమిషనర్‌లకు డిసెంట్ నోటీసు అందించారు.

చైర్మన్‌ను ఇరికించాలనా?

వాస్తవానికి వైసీపీ కౌన్సిలర్లు చేసిన ప్రతిపాదనల మేరకు 15వ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించి పనులు అజెండాలో పెట్టారు. అయితే వైసీపీ నాయకుల డైరెక్షన్ మేరకు వారి కౌన్సిలర్లు సభను సాగనీయకుండా వాకౌట్ చేయడం విశేషం. ఇదిలా ఉండగా చైర్మన్ బళ్ల గిరిబాబు.. మాజీ మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంతో పాటు ఆయన శత్రువులుగా భావిస్తున్న వారితో తిరుగుతూ పార్టీని బ్రతికించండంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇది అప్పలరాజుకు మింగుడుపడడం లేదు. ఇక్కడి అసంతృప్తి ఏకంగా పార్టీ అధిష్ఠానానికి చేరడంతో చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీని ఇరుకున పెట్టబోయి సొంత పార్టీకే ఇబ్బందులు తీసుకువచ్చే పరిస్థితికి వచ్చింది. వైసీపీ సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ సభ్యులు వాకౌట్ చేసినా సభ జరగనీయవచ్చని, అజెండాలో అంశాలు చదివి వినిపించాలని కోరారు. సమావేశం పూర్తయిన తరువాత వైసీపీ సభ్యులు డిసెంట్ లేఖ అందించారు. చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ తమ సభ్యులు ఆరోపిస్తున్నట్లుగా ఇక్కడ ఏమీ జరగలేదన్నారు. వారి ప్రతిపాదనలతో పాటు తాను వార్డులో పర్యటించినప్పుడు ప్రజలు చేసిన ఫిర్యాదులు, ఎమ్మెల్యే గౌతు శిరీష పర్యటనలో ప్రజలు కోరిన పనులను అజెండాలో పెట్టామని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు దుర్గాశంకర్‌పండా, గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్, వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ కౌన్సిలర్లు ఏ సమాచారం అడిగినా ఇవ్వడం లేదని, కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ మెప్పుకోసం అజెండాలో అంశాలు పెడుతున్నారని ఆరోపించారు.

క్రైం కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి

ఎచ్చెర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట గ్రామానికి చెందిన సీపాన చలపతిరావు (29) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే మండలం జరజాం సమీపంలోని ఓ లేఅవుట్‌లో చలపతిరావు మంగళవారం అప స్మారక స్థితిలో పడి ఉన్నాడు. సాయంత్రమైనప్పటికీ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది అతని ఫోన్ నెంబరుకు కాల్ చేశారు. ఫోన్ మోగుతున్నా లిఫ్ట్ చేయకపోవడంతో సమీపంలో వెతికారు. చివరికి జరజాం సమీపంలోని ఓ లేఅవుట్‌లో స్పృహ లేకుండా పడి ఉండడాన్ని గమనించారు. అతని పక్కన మద్యం సీసాలు ఉన్నాయి. అక్కడి నుంచి ఇంటికి తీసుకువచ్చారు. బుధ వారం ఉదయం చలపతిరావు నోటి నుంచి నురగలు రావడంతో మృతిచెందాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాకుళం సర్వజనాసపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తండ్రి అనంత ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10.260 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయిని తూకం వేస్తున్న సీఐ

ఇచ్ఛాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల 260గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. దీపక్ కుమార్ నాయక్ ఒడిశాలో కొనుగోలు చేసి బుధవారం సాయంత్రం ఆంధ్రా వైపు తీసుకువస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయిని సరఫరా చేసిన ఒడిశాకు చెందిన అజిత్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాలుగు కేజీలతో నలుగురి అరెస్టు


నిందితులతో పోలీసులు

టెక్కలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): టెక్కలి జాతీయ రహదారి సమీపంలో చేపట్టిన తనిఖీల్లో నాలుగు కిలోల గంజాయితో నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఎ.విజయ్ కుమార్ తెలిపారు. టెక్కలి సమీపంలోని దాబా వద్ద సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం జైపూర్ నుంచి ద్విచక్ర వాహనాలపై బెంగుళూరు వెళుతున్న వారిని గంజాయితో పట్టుకున్నామన్నారు. వీరిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన గోపాల్‌సర్దార్, సుమన్‌దాస్, మహదేవ్ నాయక్, సుమన్ మండల్ అనే బెంగళూరులో పెయింటింగ్, డెలివరీబాయి తదితర పనులు చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యారని వివరించారు. చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని అధిక ధరలకు అమ్మి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తరలిస్తూ పట్టుబడినట్లు సీఐ తెలిపారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయనతో ఎస్ఐ రాము, సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగకు జైలు

సోంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడిన ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ వి.లవరాజు తెలిపారు. పట్టణంలోని బీఎస్ ఆర్ షాపింగ్‌మాల్, గ్రామసచివాలయం-2 వద్ద బైక్‌లు దొంగతనాలకు పాల్పడిన ఒడిశాకు చెందిన అమిత్‌కుమార్ పాత్రోను మే 7న అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పీడీఎం కోర్టు న్యాయాధికారి కె.శ్రీనివాసరావు వాదోపవాదాలు విని ఈ మేరకు తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

ఎచ్చెర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండు వ్యాన్‌లతో అక్రమంగా తరలిస్తున్న పశువులను నవభారత్ జంక్షన్ వద్ద హైవేపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. 7 ఎద్దులు, 10 ఆవులను పట్టుకుని విజయనగరం జిల్లా గుర్లలోని గో సంరక్షణా కేంద్రానికి తరలించారు. ఈ పశువులు జిల్లాలోని నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు తరలిస్తుండగా పట్టు బడ్డాయి. వ్యాన్ డ్రైవర్‌లతో పాటు బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

కొనసాగిన ఎక్సైజ్ దాడులు


సారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాలలో ఇరురాష్ట్రాల ఎక్సైజ్ శాఖాధికారులు నాటు సారా తయారీ కేంద్రాలపై నిర్వహిస్తున్న దాడులు రెండో రోజు బుధవారం కూడా కొనసాగినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. మెళియాపుట్టి, కొత్తూరు, పలాస మండలాల సరిహద్దులకు ఆనుకొని ఉన్న ఒడిశా గ్రామాలైన శిరడా, దిద్దినగూడ, కొత్తగూడలలో చేసిన దాడులలో 6,300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. 1400 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరెంటెండెంట్ ప్రదీప్‌కుమార్ సాహు, ఆంధ్రా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు మురళి, రామచంద్ర కుమార్‌లు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

పాతపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీది గ్రామానికి చెందిన దాసరి నవీన్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివీ.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో నవీన్ మోసగించినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం నిందితుని హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ తొట్టెను ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు రామిగెడ్డ సమీపంలో ఆగి ఉన్న మున్సిపల్ ట్రాక్టర్ తొట్టె వెనుక భాగాన్ని ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు బుధవారం గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్ తొట్టెను ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి వచ్చి ఇద్దరు వ్యక్తులు ఢీకొన్నారు. వాహనం నడుపుతున్న మోహన్‌కు ఎడమ కాలు విరిగిపోగా, వెనుక కూర్చున్న సతీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది చికిత్స నిమిత్తం బాధితులను రిమ్స్‌కు తరలించారు.

అధిక లోడుతో వెళితే చర్యలు

పాతపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి లోడులతో వెళితే చర్యలు తప్పవని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రయాణికులతో ప్రయాణించే ఆటోలకు అపరాధ రుసుం విధించినట్లు ఆమె తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యాలయాల్లో సౌకర్యాలపై దృష్టి


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాలలో సౌకర్యాలు పెంచి ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నిర్వహించాలనేది తన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక కేజీబీవీలో రూ.2.55కోట్ల సమగ్రశిక్ష అభియాన్ నిధులతో స్థానిక అదనపు గదుల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ బోధన తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మంచి సేవలు అందించాలి

కొత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు మంచి సేవలు అందించాలని పీఏసీఎస్ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. బుధవారం వీరి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇవ్వటంలో ముందు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ చైర్మన్ మాతల గాంధీ, డైరెక్టర్లు అరుబోతు దశరథ, చోడవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన కేంద్ర మాజీ మంత్రి కృపారాణి


ఖర్గేతో కృపారాణి

టెక్కలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఖర్గేను కలిసి స్థానిక రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు.

యోగా పోటీలు సమర్థవంతంగా నిర్వహించాలి


ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

నరసన్నపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 3న నరసన్నపేట జూనియర్ కళాశాలలో జరిగే జిల్లా స్థాయి యోగా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. బుధవారం యోగా పోటీలు నిర్వాహక కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కింజరాపు రామారావు, కేదారి, రవికుమార్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలసలో కేంద్ర బృందం పర్యటన


నీటి తొట్టెను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

సంతబొమ్మాళి, జూలై23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లెవల్ మాని టరింగ్ బృందం మండలంలో రెండో రోజైన బుధవారం కూడా పర్యటించింది. తాళ్ల వలస పంచాయతీలో ఆ బృంద సభ్యులు సునీల్‌బంతా, నామాసింగ్‌లు పర్యటిం చారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. డ్వాక్రా సభ్యులతో ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయంత్ ప్రసాద్, సర్పంచ్ గున్న జానకమ్మ, ఏపీవో పంగ నర్సింహమూర్తి, పంచాయితీ కార్యదర్శి విజయ్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే పనులు నిలిపివేస్తాం

పాతపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా వేతనాలు చెల్లించకుంటే పారిశుద్ధ్య పనులు నిలిపివేస్తామని ఆ కార్మిక సంఘ నాయకురాలు మల్లిపురపు దేవి తెలిపారు. స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకులంలో పారిశుద్ధ్య కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.

స్వల్పంగా పెరిగిన వంశధార


గొట్టా బ్యారేజి దిగువకు విడిచిపెడుతున్న నీరు

హిరమండలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజి వద్ద వంశధార నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. బుధవారం సాయంత్రానికి బ్యారేజి వద్దకు 7,315 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా... దిగువకు 5,054 క్యూసెక్కుల నీరు విడిచిపెడుతున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,614, కుడి కాలువ ద్వారా 647 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు.

ఆయిల్‌పామ్‌తో ఆదాయం


మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి సునీత

జలుమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒక ఎకరా విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసి ఏడాదిలో రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చని ఉద్యానవన అధికారి కె.సునీత తెలిపారు. సుబ్రమణ్యపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేళాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు ప్రభుత్వం ఎకరాకు 40 నుంచి 50 మొక్కల వరకు రాయితీపై అందిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుందన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ


భోజనాలను పరిశీలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

మెళియాపుట్టి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెద్దలక్ష్మీపురం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఏపీవో జి.చిన్నబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు వస్తున్నందు వల్ల జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లాలన్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

ఆసుపత్రిలో వ్యాక్సిన్ల కొరత

టెక్కలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వ్యాక్సిన్ల కొరత నెలకొంది. ప్రతి బుధవారం, శనివారం చిన్నారులకు వేసే రోటా, బీపీటీ, ఐపీవీ తదితర వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో చిన్నారులతో ఆసుపత్రికి వచ్చిన తల్లిదండ్రులు నిరాశతో తిరిగి వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి కేంద్ర ఆసుపత్రిలో వ్యాక్సిన్ కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఎరువుల కొరత లేదు

కోటబొమ్మాళి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలంలోగల 27 రైతు సేవా కేంద్రాల వద్ద అన్ని ఎరువులు సిద్ధంగా ఉన్నాయని.. ఎక్కడా కొరత లేదని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం పెద్ద బమ్మిడి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు మండలంలో ఎరువుల కొరత ఉందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రైతులు ఇలాంటి వదంతులు నమ్మవద్దన్నారు. అనంతరం పశువుల దాణాను పంపిణీ చేశారు.

తరుగు చూసుకునే బాధ్యత డీలర్లదే

జలుమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల గొడాం నుంచి ప్రతి నెల బియ్యం, నిత్యావసర సరుకులు తీసుకెళ్లినపుడు తరుగు చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లపైనే ఉందని తహసీల్దారు జె.రామారావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీటీ జాఫర్ షరీఫ్, ఆర్.ఐ. కిరణ్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

నరసన్నపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల యజమానులు రైతులకు ఇబ్బంది కలగనీయవద్దని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి సూచించారు. బుధవారం పట్టణంలోని నాగార్జున రైతు డిపో, గణేష్ రైతు డిపోలను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులకు బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, డీటీ రామకృష్ణ, ఏవో సూర్యకుమారి పాల్గొన్నారు.

సమస్యలకు తావులేకుండా పనులు చేసుకోండి

టెక్కలి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమస్యలు కలగకుండా గ్రానైట్ క్వారీ పనులు చేసుకోవాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం లింగాలవలసలో క్వారీ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. స్థానికులు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ కరుణశ్రీ, ఏడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

నరసన్నపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ వద్ద దివ్యాంగుల చిన్నారులకు ట్రైసైకిళ్లను ఎంఈవో పి.దాలినాయుడు బుధవారం పంపిణీ చేశారు. మానసిక, శారీరక ఎదుగుదల లేని పిల్లలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎంఈవో దాలినాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర సిబ్బంది కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

టెక్కలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు సంబంధించి అవగాహన కోసం టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం కళాజాతాను ప్రదర్శించారు. వైసీటీపీయూ ట్రక్కర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వాహనదారులు, డ్రైవర్లు, విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మాధవరావు, హెల్త్ ఎడ్యుకేటర్ హరనాథ్‌రెడ్డి, జగన్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్ మృతి


రఘునాథ్(ఫైల్)

హరిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హంసరాలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నెయ్యిల రఘునాథ్(85) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. పీసీసీ మాజీ అధ్యక్షులు మజ్జి తులసీదాస్ ప్రధాన అనుచరుడిగా అనంతరం మజ్జి శారద అనుచరుడిగా పార్టీలో నడిచారు. ఆయన మృతికి కాంగ్రెస్ నాయకులు కొర్ల హేమారావు చౌదరి, నాగేశ్వరరావు, ఎం.బాబూరావు, రాజా రావు, కె.వెంకటరావు సంతాపం వ్యక్తం చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు (సారవకోట), జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి 11 కేవీ సబ్‌స్టేషను పరిధిలో ఈనెల 25న శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నటు ఈఈ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మదనాపురం, జమచక్రం, కిడిమి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.